
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 25 । జనవరి । 2025



సోమశిలలో 68.531 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారానికి 68.531 టీఎంసీలు ఉన్నాయి. 1,866 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, దిగువ కాలువలకు 3950 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.82,960
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,558
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,785
నవర (8 గ్రాములు)	రూ.62,280

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31.5 /22.3

జిల్లాలో వాతావరణం శనివారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 66 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాటేపల్లి పంచాయతీ సెక్రటరీ సస్పెన్షన్

నెల్లూరు (పొగతోట): విధుల పట్ల నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగంపై వింజమూరు మండలం కాటేపల్లి పంచాయతీ సెక్రటరీ ప్రసన్నకుమారిని సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాల మేరకు డీపీఓ శ్రీధర్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీలో నిబంధనలకు విరుద్ధంగా నిధుల చెల్లింపు, ఇంటి పన్ను వసూళ్ల జమ చేయకుండా దుర్వినియోగం చేయడం తదితర విషయాలపై ఫిర్యాదులు అందాయి. కావలి డివిజనల్ పంచాయతీ ఆఫీసర్ రికార్డులు పరిశీలించి నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేశారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా వాకాటి ప్రమాణ స్వీకారం



రెడ్‌క్రాస్ నూతన చైర్మన్‌కు అభినందనలు తెలుపుతున్న మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి

నెల్లూరు(అర్బన్): జిల్లా రెడ్‌క్రాస్ నూతన చైర్మన్‌గా వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా జనార్దన్‌రాజులు శుక్రవారం మద్రాస్ బస్టాండ్ వద్ద గల రెడ్‌క్రాస్ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్‌క్రాస్ ద్వారా సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ప్రజల మన్ననలను పొందేందుకు కృషి చేస్తామన్నారు.

నూతన కమిటీకి సహకరిస్తాం

ఇదే సందర్భంలో రెడ్‌క్రాస్ మాజీ చైర్మన్, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డితో పాటు కోర్టు ద్వారా తిరిగి మేనేజింగ్ కమిటీ సభ్యులైన దామిశెట్టి సుధీర్‌నాయుడు, గంధం ప్రసన్నాంజనేయులు, మలిరెడ్డి కోటారెడ్డి, నేతాజీ సుబ్బారెడ్డిలు అక్కడకు వచ్చారు. నూతన కమిటీ చైర్మన్ విజయకుమార్‌రెడ్డికి షేక్ హ్యాండ్ ఇచ్చి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి అభినందించారు. రెడ్‌క్రాస్ అభివృద్ధికి తాము సంపూర్ణ సహకారమందిస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కలెక్టర్ ఆనంద్ తమ ఐదు మందిని కమిటీ సభ్యులుగా తొలగించడమే కాకుండా ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దు చేయడంతోనే తాము కోర్టుకెళ్లామని తెలిపారు. కలెక్టర్ నిర్ణయాన్ని తప్పుపట్టి కోర్టు తమకు న్యాయం చేసిందన్నారు. ఈ ప్రమాణ స్వీకారంలో ఎంసీ మెంబర్లు రంగయ్యానాయుడు, బయ్యా ప్రసాద్, రవికుమార్, గునుపాటి ప్రసాద్‌రెడ్డి, శ్రీహరి తదితరులతో పాటు పలువురు పాల్గొన్నారు.

బస్సు నడుపుతుండగా ఆర్టీసీ డ్రైవర్‌కు అస్వస్థత

- చాకచక్యంగా సీహెచ్‌సీ వద్ద నిలిపివేత
- ప్రయాణికులు భద్రం



సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న డ్రైవర్ రమేష్‌రెడ్డి

పొదలకూరు: ఆర్టీసీ బస్సు నడుపుతున్న డ్రైవర్ ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యాడు. ప్రయాణికులకు ఎలాంటి ముప్పు తలెత్తకుండా చాకచక్యంగా బస్సును స్థానిక సీహెచ్‌సీ వద్ద నిలిపిన ఘటన శుక్రవారం పొదలకూరులో జరిగింది. రాపూరు డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్‌రెడ్డి పెంచలకోన నుంచి పొదలకూరు మీదుగా నెల్లూరుకు ప్రయాణికులతో బయలుదేరాడు. ఆ సమయంలో బస్సులు 40 మంది ప్రయాణికులు ఉన్నారు. మార్గమధ్యంలో ఛాతిలో నొప్పి ప్రారంభం కావడంతో డ్రైవర్ అప్రమత్తమై బస్సును కష్టంగా నడుపుకుంటూ వచ్చి మెయిన్ రోడ్డులో ఉన్న సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద నిలిపివేశారు. వెంటనే ప్రయాణికులు, కండక్టర్ గమనించి డ్రైవర్‌ను సీహెచ్‌సీలో చేర్పించడంతో వైద్యులు చికిత్స అందజేశారు. బస్సులో ప్రయాణికులను మరో బస్సులో కండక్టర్ పంపారు. ఛాతిలో నొప్పిగా ఉన్నా భరిస్తూ ప్రయాణికులను సురక్షితంగా తీసుకు వచ్చిన డ్రైవర్‌ను ఆసుపత్రి వద్ద ఉన్న వారు అభినందించారు. డ్రైవర్ రమేష్‌రెడ్డి చికిత్స తీసుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోయినట్లు వైద్యులు వెల్లడించారు.

6 నెలలు.. 6 కేసులు!



రాష్ట్రంలో పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్నే అమలు చేస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలు, అసమర్థతను ప్రశ్నించే వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. వాట్సప్ గ్రూపుల్లో వచ్చిన మెసేజ్‌లు ఫార్వర్డ్ చేయడాన్ని కూడా నేరంగా భావించి కేసులు నమోదు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సామాన్యుడి నుంచి మాజీ మంత్రులపైనా కేసులు నమోదు చేసి ముప్పతిప్పలు పెడుతున్నారు. రెండు రోజుల క్రితం మాజీ పోలీస్ ఉన్నతాధికారి మాజీ ముఖ్యమంత్రినే టార్గెట్ చేసి బూతులతో తులనాడినా కేసు నమోదు చేయని పోలీసులు.. మీడియా ద్వారా పోలీసుల వైఫల్యాలను ఎత్తిచూపిన జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఆరు నెలల వ్యవధిలో ఆయనపై ఆరు కేసులు నమోదు చేసి జిల్లా పోలీసులూ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారు.

- మాజీ మంత్రి కాకాణిపై నమోదు చేసిన పోలీసులు
- ప్రభుత్వాన్ని, పోలీసుల పక్షపాత ధోరణిని ప్రశ్నించినా కేసులే
- ప్రెస్‌మీట్ వివరాలు వాట్సప్ గ్రూపులో ఫార్వర్డ్ చేసినా అంతే
- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను మాజీ పోలీస్ అధికారి తూలనాడితే మాత్రం నో కేస్
- ఎన్ని కేసులు నమోదు చేసినా ప్రశ్నిస్తూనే ఉంటానన్న కాకాణి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇప్పటి వరకు ఆరు కేసులు నమోదయ్యాయి. గతేడాది గుంటూరు జిల్లా తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ సెంట్రల్ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెడితే ఆ వార్తను 'సాక్షి' కవర్ చేసింది. ఆ పేపర్ కటింగ్‌ను సోషల్ మీడియాలో తన వాట్సప్ నంబర్‌తో ఫార్వర్డ్ చేశాడని వెంకటాచలం పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే వెంకటాచలం మండలానికి చెందిన బీజేపీ నేత నెల్లూరులో ప్రెస్‌మీట్ పెడితే ఆ వీడియో కాకాణి వాట్సప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశాడని మరోకేసు నమోదు చేశారు.

ఎవరో ఫిర్యాదు చేస్తే కేసులు

మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రతి నిత్యం ప్రభుత్వ వైఫల్యాలతో పాటు సొంత నియోజకవర్గం సర్వేపల్లిలో జరిగే అవినీతి, అక్రమాలను ఎండగడుతున్నారు. ఇది రుచించని ప్రభుత్వ పెద్దలతో పాటు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి తమ అనుచరవర్గాల చేత ఫిర్యాదులు చేయిస్తూ కేసులు నమోదు చేయిస్తున్నారు. వాస్తవాలను పరిగణలోకి తీసుకోకుండా పోలీసులు ఫిర్యాదు వచ్చిందే తడువుగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేస్తున్నారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతి, అక్రమాలపై వచ్చిన మెసేజ్‌ను వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశాడని, అది ముత్తుకూరుకు చెందిన ఓ టీడీపీ కార్యకర్తకు బాధేసిందంటా.. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అలాగే వెంకటాచలంలో కూడా పేపర్ కటింగ్‌లు గ్రూపుల్లో ఫార్వర్డ్ చేశాడని టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేస్తే రెండు కేసులు.. పోలీస్ వైఫల్యాలను ప్రశ్నించి.. ఒకవేళ ప్రభుత్వం మారితే తప్పు చేసిన అధికారులపై చర్యలుంటాయని చేసిన వ్యాఖ్యలపై రెండు కేసులు నమోదు చేశారు. కానీ ఏ ఫిర్యాదు కూడా బాధిత వర్గాల నుంచి వచ్చినవి కాకపోవడం గమనార్హం.

స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డిపై అసభ్యకరంగా పోస్టింగ్ పెట్టాడని ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

- గత అక్టోబర్‌లో ప్రభుత్వం ఉచిత ఇసుక విధానం అమలు చేయకపోవడంతో భవన కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో భాగంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి వారికి సంఘీభావంగా వెళ్లి నిరసన ప్రదర్శనలో పాల్గొన్నందుకు కూడా కేసు నమోదు చేశారు.
- గత డిసెంబర్ నెలలో వెంకటాచలం మాజీ జెడ్పీటీసీ శేషయ్యపై పోలీసులు అక్రమ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. ఆ కేసులో పోలీసులే సాక్ష్యాలు తారుమారు చేసిన విషయాలు వెలుగులోకి రావడంతో పోలీసుల తీరుపై మాజీ మంత్రి కాకాణి ఆగ్రహం వ్యక్తం చేసి తప్పు చేసిన పోలీసులపై మండిపడ్డారు. ఆయన చేసిన వ్యాఖ్యలపై వెంకటాచలంకు చెందిన టీడీపీ కార్యకర్త నెల్లూరు ఐదో నగరంలో ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశారు.
- తాజాగా కావలి నియోజకవర్గం బోగోలు మండలం కోళ్లదిన్నెలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై టీడీపీ శ్రేణులు దాడులకు పాల్పడ్డారు. గాయపడిన వారు కావలి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న సమయంలో మరోసారి దాడులకు తెగబడ్డారు. బాధితులను ఈ నెల 19న పరామర్శించిన కాకాణి అక్కడ మీడియాతో మాట్లాడుతూ పోలీసుల పక్షపాత వైఖరిని ఎండగట్టి తప్పు చేసిన అధికారులు ఎవరైనా శిక్ష అనుభవించాల్సిందేనని వ్యాఖ్యలు చేశారు. ఆయన చేసిన వ్యాఖ్యలు కోళ్లదిన్నె టీడీపీ మహిళా కార్యకర్తకు బాధ కల్గించిందని ఆమె కావలి వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కేసులకు భయపడేది లేదు

నేను కేసులకు భయపడి ప్రశ్నించే విధానాన్ని మాత్రం మానుకోను. ప్రభుత్వ వైఫల్యాలను నిత్యం ఎండగడుతూనే ఉంటా. సర్వేపల్లిలో ఎమ్మెల్యే సోమిరెడ్డి అవినీతిని బయటపెడుతూనే ఉంటా. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్యాయం జరిగితే సహించబోను. మా పార్టీ అధినేత వైఎస్ జగన్ అడుగుజాడల్లో నడుస్తూ మా పార్టీ కార్యకర్తలను కాపాడుకుంటాం. అందుకే ఎన్ని కేసులు నమోదైనా జంకే ప్రసక్తేలేదు.
– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి

పంచాయతీ కార్యదర్శిపై విచారణ

- విచారణకు డుమ్మా కొట్టిన కార్యదర్శి



నాగులవరం సచివాలయంలో విచారణ చేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ నయీం

సాక్షి ఎఫెక్ట్..

బిట్రగుంట: బోగోలు మండలం నాగులవరం పంచాయతీ కార్యదర్శి భాస్కర్ వ్యవహార శైలిపై అధికారులు శుక్రవారం విచారణ చేపట్టారు. ఇంటి పన్ను కట్టించుకునే విషయంలో అదనంగా వసూలు చేస్తున్నాడనే ఆరోపణలతో పాటు గ్రామస్తులతో దురుసుగా ప్రవర్తించిన వీడియోలు రెండు రోజులుగా వైరల్ అవడం, 'సాక్షి'లో ప్రముఖంగా కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. స్పందించిన జిల్లా అధికారులు విచారణకు ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ కోసం ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓపీఆర్డీ నయీంలు సచివాలయంకు వెళ్లగా పంచాయతీ కార్యదర్శి విధుల్లో లేని విషయం బయట పడింది. ఉదయం సచివాలయానికి వచ్చిన కార్యదర్శి విచారణ విషయం ముందుగానే తెలుసుకుని 'జిల్లా ఎస్పీని కలిసేందుకు వెళుతున్నానని' మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసి వెళ్లిపోయారు. అధికారుల ముందస్తు అనుమతి లేకుండా, అధికారిక కార్యక్రమం కాకుండా కేవలం మూవ్‌మెంట్ రిజిస్టర్‌లో ఎస్పీ కార్యాలయం పేరు రాసి విచారణకు డుమ్మా కొట్టాడు. దీంతో ఎంపీడీఓ, ఈఓపీఆర్డీలు గ్రామస్తుల నుంచి, సచివాలయ సిబ్బంది నుంచి వివరాలు సేకరించి స్టేట్‌మెంట్ నమోదు చేసుకున్నారు. ఇదిలా ఉండగా వసూలు చేసిన ఇంటి పన్నులు కొంత మేర దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు.



సీపీఎం రాష్ట్ర మహాసభల నగారా మోగిస్తున్న రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఎర్రసైన్యం కవాతు

- 1, 2 తేదీల్లో సీపీఎం రాష్ట్ర మహాసభలు
- నగారా మోగించిన రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): ఫిబ్రవరి 1, 2 తేదీల్లో నెల్లూరులో నిర్వహించే సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలకు నాందిగా శుక్రవారం ట్రంకురోడ్డులో ఎర్రసైన్యం కవాతు చేపట్టింది. తొలుత వీఆర్సీ మైదానంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నగారా మోగించి మహాసభలను ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఆ పార్టీ నాయకులు, కార్యకర్తల రెడ్ ఆర్మీ నుంచి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం వీఆర్సీ సెంటర్ నుంచి గాంధీబొమ్మ మీదుగా ట్రంకురోడ్డు వరకు కవాతు (ర్యాలీ) నిర్వహించడంతో నగర వీధులు ఎర్ర దండుతో నిండిపోయాయి. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు రమాదేవి మాట్లాడుతూ సింహపురి ప్రజా ఉద్యమాలకు పురుడు పోసుకున్న గడ్డ అని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకు స్ఫూర్తిగా నిలిచిందని దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జన్మించిన ఈ నేలపై సీపీఎం రాష్ట్ర మహాసభలను నిర్వహించటం గర్వంగా ఉందన్నారు. ఫిబ్రవరి 1, 2 తేదీల్లో సీతారాం ఏచూరినగర్‌లో ప్రతినిధుల సభ, వీఆర్సీ మైదానంలో మల్లు స్వరాజ్యం ప్రాంగణం పేరుతో 3వ తేదీ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి ముత్తుకూరుగేట్ సెంటర్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహాసభల సందర్భంగా వారం రోజుల నుంచి రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సీపీఎం నాయకులు, వలంటీర్లు అంకితభావంతో పని చేసే కార్యకర్తలు ప్రజలకు అవగాహన కలిగించి ప్రజలకు తాము మద్దతుగా ఉన్నామని తెలియజేస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు.

రాజకీయాల్లోకి యువతరం రావాలి

కుల సంస్కృతి రాజకీయాలతో రాష్ట్రం భ్రష్టుపట్టిపోతుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. నేటి యువతరాన్ని రాజకీయాల్లోకి రానీయకుండా సంపాదించండి, ఖర్చు చేయండి అనే సంస్కృతిలోకి నేటి ప్రభుత్వం నెట్టేస్తోందని ఆరోపించారు. నూతన ఆర్థిక విధానాల పేరుతో యువతను పాడు చేస్తున్నారని మండిపడ్డారు. యువతరం రాజకీయాల్లోకి రావాలని, నాయకత్వం చేపట్టి అవినీతికర పరిస్థితులను మార్చాలని సీపీఎం కోరుకుంటుందన్నారు. నేటి యువతరం నిరుద్యోగ సమస్యతో అల్లాడుతోందని, నిరుద్యోగ సమస్యకు పరిష్కారం, సామాజిక న్యాయం, సోషలిజం ద్వారానే సాధ్యమనే సందేశంతో ముందుకు వస్తున్నామన్నారు. నేటి సమాజం కోసం, ప్రజల భవిష్యత్ కోసం ఒక ప్రత్యామ్నాయ రాజకీయ విధానాన్ని, ప్రజాపోరాటాలపై మహాసభలో చర్చించి తదనుగుణంగా కార్యాచరణ రూపొందిస్తామన్నామన్నారు. ఈ కార్యక్రమానికి సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మోహన్‌రావు, అజయ్‌కుమార్, గోపాల్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, సూర్యనారాయణ, కాయం శ్రీనివాసులు నగర కమిటీ సభ్యులు నరసింహ, రషీద్, మూలం ప్రసాద్, చిరంజీవి, చెంగయ్య, ఏమేలు, శ్రీనివాసులురెడ్డి, పెంచలయ్య, జాఫర్, వేణు, శాఖా కార్యదర్శులు, పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వానిది నీచ సంస్కృతి

- కలెక్టర్, ఎస్పీలు టీడీపీ నేతల్లా వ్యవహరిస్తున్నారు
- ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే అధికారులను వదలబోము
- అధికారం శాశ్వతం కాదనే విషయం గుర్తుపెట్టుకోవాలి
- మాజీ మంత్రులు కాకాణి, నల్లపరెడ్డి
- చిరుద్యోగుల తొలగింపుపై కదం తొక్కిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



ర్యాలీలో పాల్గొన్న పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

కొడవలూరు: సర్పంచ్‌ల చెక్‌పవర్‌లను ఏకపక్షంగా రద్దు చేస్తూ నీచ సంస్కృతికి శ్రీకారం చుట్టిన కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో సహా ప్రజలే పెకలించి వేస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి హెచ్చరించారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ వ్యవస్థల్లో పనిచేస్తున్న చిరుద్యోగులను తొలగించి, అధికార పార్టీ కార్యకర్తలను చొప్పిస్తున్న కూటమి పార్టీల నేతల దుష్ట రాజకీయానికి కాలం చెల్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోవూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ నేతలు కక్ష సాధింపు ధోరణితో సర్పంచ్‌ల చెక్ పవర్‌లు తొలగించడం, వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్స్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, రేషన్ డీలర్లను తొలగించడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కొడవలూరులో శుక్రవారం చేపట్టిన ఆందోళనకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చాయి. కొడవలూరు సెంటర్ నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చిన తర్వాత ఇలాంటి వికృతమైన ప్రభుత్వాన్ని ఇంత వరకూ చూడలేదన్నారు. కోవూరు నియోజకవర్గంలో రాజకీయ అరాచకం అత్యంత హేయంగా ఉందన్నారు. ఎలాంటి వివరణ కోరకుండానే సర్పంచ్‌ల చెక్‌పవర్ తొలగించడం, ఏళ్ల తరబడి కొలువులను నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్న చిరుద్యోగులైన వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులను నిర్దాక్షిణ్యంగా తొలగించి కడుపు కొట్టడం నీచ సంస్కృతికి అద్దం పడుతోందన్నారు. జిల్లాలో ఉన్నత పదవుల్లో ఉన్న కలెక్టర్, ఎస్పీలు సైతం టీడీపీ కార్యకర్తల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేధించే అధికారులను ఎవరినీ వదలి పెట్టమని హెచ్చరించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని అధికారంలోకి వచ్చిన 7 నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందన్నారు.

కక్షపూరిత రాజకీయాలకు మూల్యం తప్పదు: చలపతి

కక్ష పూరిత రాజకీయాలు కొనసాగిస్తే మూల్యం చెల్లించుకోక తప్పదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని జిల్లా అధికార ప్రతినిధి వీరి చలపతిరావు హెచ్చరించారు. పేద ఎస్సీ, ఎస్టీ, బీసీల చిరుద్యోగాలను నిర్దాక్షిణ్యంగా తొలగించి కడుపు కోత మిగిల్చే నీచ రాజకీయాలు మానుకోవాలని సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జి.జ్యోతి, వైఎస్సార్‌సీపీ నేతలు జి.విజయకుమార్, డి.నిరంజన్‌బాబురెడ్డి, చిమటా శేషగిరి, నవీన్‌రెడ్డి, ఎం.శ్రీనివాసులురెడ్డి, కె.శ్రీనివాసులురెడ్డి, పి.నాగశ్రీనివాసులురెడ్డి, మోహన్‌కృష్ణ, సర్పంచ్‌లు బి.సుప్రియ, హరితలు పాల్గొన్నారు.

ఈవీఎంలతో గెలిచి ఇంత అరాచకమా?: ప్రసన్న

ఈ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి అధికారం ఎలా దక్కిందో రాష్ట్ర ప్రజలకే కాదు.. దేశంతో పాటు ప్రపంచం మొత్తం తెలుసునని, అడ్డదారిలో అధికారంలోకి వచ్చి ఇంత అరాచకానికి పాల్పడుతున్న కూటమి పార్టీల నేతలు, వీరిని నమ్ముకుని పక్షపాతంగా వ్యవహరిస్తున్న అధికారులు రాబోయే రోజుల్లో కర్మ ఫలితాలను అనుభవిస్తారని కోవూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. మహిళా సర్పంచ్‌ని వ్యక్తిగతంగా వెళ్లి టీడీపీ నాయకులను కలవమని అధికారులు నిస్సిగ్గుగా చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలోనే పార్టీలు ఉండాలే తప్ప తర్వాత ప్రజలంతా ఒక్కటేనన్న భావనతో ఉండాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాము ఎవరినీ నిర్దాక్షిణ్యంగా తొలగించి కడుపులు కొట్టలేదన్నారు. ఈఓపీఆర్డీ మహిళా సర్పంచ్‌తో వ్యవహరించిన తీరు జుగుప్సాకరంగా ఉందన్నారు. ధర్నాకు వస్తున్నట్లు ముందుగా తెలిపినా ఎంపీడీఓ లేకుండా పోవడం వారి నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతోందన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న గోవర్ధన్‌రెడ్డి, ప్రసన్న తదితరులు



మాట్లాడుతున్న కాకాణి, పక్కన ప్రసన్నకుమార్‌రెడ్డి తదితరులు

నర్సింగ్ విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్

నెల్లూరు(అర్బన్): నగరంలోని దుర్గా నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ కోర్సు అభ్యసిస్తున్న పలువురు ఫుడ్ పాయిజన్ బారిన పడ్డారు. 13 మంది కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో నగరంలోని ప్రభుత్వ పెద్దాస్పత్రిలో శుక్రవారం అడ్మిట్ అయ్యారు. అందరికీ ఆరోగ్యం కుదుట పడడంతో సాయంత్రానికి డిశ్చార్జి చేశారు. ఈ సందర్భంగా పెద్దాస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ ఫుడ్ పాయిజనింగ్‌తో విద్యార్థినులు ఆస్పత్రిలో చేరినట్లు వివరించారు. నర్సింగ్ కళాశాలల పర్యవేక్షణ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి చేతిలో ఉంటుంది. అంత మందికి ఫుడ్ పాయిజన్ జరిగితే కనీసం డీఎంహెచ్‌ఓ సుజాత నర్సింగ్ కళాశాలను తనిఖీ చేయలేదని, ఊరుకాని ఊరు నుంచి చదువు కోసం వచ్చి ఫుడ్‌పాయిజనింగ్‌తో పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సింగ్ విద్యార్థులను పరామర్శించ లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మువ్వన్నెలు మురిసేలా..

- గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలోని పోలీసు కవాతు మైదానంలో ఆదివారం జరిగే గణతంత్ర వేడుకలకు అధికార యంత్రాగం ఏర్పాట్లు చేస్తోంది. మైదానాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. చదును చేసి శుభ్రం చేశారు. గణతంత్ర సంబరాన్ని చాటేలా ప్రాంగణమంతా మువ్వన్నెల రంగులతో నింపేస్తున్నారు. ముఖ్యఅతిథులు, ప్రజలు కూర్చునేందుకు వీలుగా వేర్వేరుగా సీట్లను ఏర్పాటు చేస్తున్నారు. మరోవైపు పోలీసులు గణతంత్ర రిహార్సల్‌ను చేస్తున్నారు. 26 ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆనంద్ జాతీయ పతకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.15కు జిల్లా ప్రగతి నివేదిక వినిపిస్తారు. 9.30 ప్రగతి శకటాల ప్రదర్శన, 10 గంటలకు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, 10.50కు అధికారులు, సిబ్బందికి, సేవా సంస్థలకు ప్రశంసాపత్రాల ప్రదానం, 11.35లకు స్టాల్స్ సందర్శన, 11.55 జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగుస్తుంది.

- జేసీ కార్తీక్ శుక్రవారం సాయంత్రం ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. వారికి సూచనలిచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. అనంతరం వీఐపీ, మీడియా గ్యాలరీలను పరిశీలించారు. ఆయన వెంట ఏఆర్ ఏఎస్పీ మునిరాజా, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, ఆర్డీఓ అనూష, డ్వామా, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ అధికారులు గంగాభవాని, నాగరాజకుమారి, డీఎంహెచ్‌ఓ సుజాత, డిప్యూటీ డీఈఓ ప్రసన్నలక్ష్మి తదితరులున్నారు.




అధికారులకు సూచనలిస్తున్న జేసీ కార్తీక్


ప్రాక్టీస్ చేసేందుకు వచ్చిన విద్యార్థినులు


కవాతు రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

ఆర్డర్లు ఇప్పిస్తానని.. బంగారం కాజేసి

- గంటల వ్యవధిలో నిందితుడి అరెస్ట్
- రూ.52 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

నెల్లూరు (క్రైమ్): తన వద్ద పని చేసిన వ్యక్తి సొంతంగా బంగారు ఆభరణాలు తయారు చేస్తూ ఆర్థికంగా స్థిరపడటాన్ని ఆ యజమాని జీర్ణించుకోలేకపోయాడు. తనకు తెలిసిన వ్యాపారులకు చూపించి ఆర్డర్లు ఇప్పిస్తానని నమ్మించి అతడి నుంచి ఆభరణాలు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గంటల వ్యవధిలోనే నిందితుడిని అరెస్ట్ చేసి, రూ.52 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం నగర డీఎస్పీ పి.సింధుప్రియ చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావుతో కలిసి నెల్లూరులోని డీఎస్పీ కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. వెంకటేశ్వరపురం ఇస్లాంపేటకు చెందిన షేక్ ముజఫర్ బంగారు నగల తయారీదారుడు. అతను కమీషన్ పద్ధతిపై కొరడావీధిలోని బంగారు వ్యాపారుల వద్ద ఆర్డర్లు తీసుకుని ఆభరణాలు తయారు చేసి ఇస్తూ ఆర్థికంగా స్థిరపడ్డాడు. గతంలో ముజఫర్ పరమేశ్వరినగర్‌కు చెందిన జాకీర్ వద్ద బంగారు ఆభరణాలు తయారు చేసేవాడు. ముజఫర్ ఎదుగుదలని చూసి ఓర్వలేని ఆయన ఎలాగైనా దెబ్బకొట్టాలని అనుకున్నాడు.

ఆభరణాలు కాజేసేందుకు ప్లాన్

ముజఫర్ బంగారు వ్యాపారుల వద్ద రూ.52 లక్షలు విలువైన 660 గ్రాముల బంగారాన్ని తీసుకున్నాడు. 19 బంగారు నెక్లెస్‌లు, ఆరు బంగారు హారాలను ఆకర్షణీయమైన మోడల్స్‌లో తయారు చేశాడు. ఈ విషయం తెలుసుకున్న జాకీర్ వాటిని కాజేయాలని నిర్ణయించుకుని గురువారం ముజఫర్‌కు ఫోన్ చేసి తయారు చేసిన ఆభరణాలు తీసుకొస్తే తనకు తెలిసిన వ్యాపారులకు చూపించి ఆర్డర్లు ఇప్పిస్తానని నమ్మబలికాడు. అతని మాటలు నమ్మిన ముజఫర్ నగలతో జాకీర్ ఇంటికి వెళ్లి వాటిని చూపించాడు. జాకీర్ బారకాస్ సెంటర్‌లోని బంగారు వ్యాపారికి చూపిద్దామని చెబుతూ తన చేతిలోని బ్యాగ్‌లో బంగారు ఆభరణాల కవర్‌ను పెట్టాడు. ఇద్దరూ కలిసి బయటకు వచ్చే క్రమంలో జాకీర్ బంగారు ఆభరణాల కవర్‌ను తీసుకుని ఇంట్లోని మూలకు విసిరేశాడు. ఏమి తెలియనట్లు ముజఫర్ బైక్‌పై వెనుక కూర్చొని బంగారు వ్యాపారి ఇంటి వద్దకు వెళ్లారు.

మాజీ యజమాని బుకాయింపు

ముజఫర్ బంగారు నగల కవర్ ఇవ్వమని జాకీర్‌ను అడిగాడు. బ్యాగ్‌లోని బంగారు ఆభరణాల కవర్ కనిపించడం లేదని, ఎక్కడో పడిపోయి ఉంటుందని కంగారు పడుతున్నట్లు జాకీర్ నటించాడు. దీంతో ఇద్దరూ కలిసి వారు వచ్చిన మార్గంలో వెతుక్కుంటూ జాకీర్ ఇంటి వరకు వెళ్లారు. ఆభరణాల కవర్ లేదు. మాజీ యజమాని ప్రవర్తన అనుమానాస్పదంగా ఉండటంతో ఆయనే బంగారు ఆభరణాలను చోరీ చేశాడని బాధితుడు నిర్ధారణకు వచ్చాడు. ఈ మేరకు శుక్రవారం తెల్లవారుజామున చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

గంటల వ్యవధిలోనే..

కేసు నమోదు చేసిన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు తన సిబ్బందితో కలిసి దర్యాప్తు వేగవంతం చేశారు. జాకీర్ ఇంట్లో లేకపోవడం, అక్కడున్న సీసీ కెమెరాలు ఆఫ్ చేసి ఉండడం పోలీసులు గమనించారు. సాంకేతికత ఆధారంగా జాకీర్‌ను ఇరుగాలమ్మ గుడి సమీపంలో అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అతను తొలుత పొంతనలేని సమాధానాలు చెప్పడంతో తమదైన శైలిలో విచారించగా బంగారు ఆభరణాలు కాజేసినట్లు వెల్లడించాడు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి 660 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావుతోపాటు ఏఎస్సై శ్రీహరి, హెచ్‌సీ సురేష్, కృష్ణకిశోర్, పీసీలు శ్యామ్, సుబ్బారావు, రియాజుద్దీన్, సైబర్ వింగ్ సిబ్బంది ప్రసాద్, కిశోర్, డ్రైవర్ రామాంజనేయరెడ్డిని డీఎస్పీ అభినందించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.


నిందితుడి వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సింధుప్రియ, చిత్రంలో ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, సిబ్బంది

ఉదయగిరి నుంచి ఢిల్లీకి..

- చెక్క నగిషీ వస్తువుల తయారీలో షాహీనా ప్రతిభ
- ఆమెకు అరుదైన అవకాశం
- గణతంత్ర వేడుకలను తిలకించేందుకు పిలుపు

ఉదయగిరి: ఢిల్లీలో జరిగే గణతంత్ర వేడుకలను ప్రత్యక్షంగా చూసే అరుదైన అవకాశం ఉదయగిరిలోని దిలారు బావి వీధికి చెందిన షేక్ షాహీనాకు లభించింది. కుటుంబ పోషణ కోసం ఆమె నేర్చుకున్న కళ నేడు గౌరవాన్ని తెచ్చిపెట్టడంతో ఆనందం వ్యక్తం చేస్తోంది. అప్పట్లో ఆ వీధిలోని అనేక కుటుంబాలు కొండకర్ర ఆధారంగా చెక్క నగిషీ వస్తువులు తయారు చేసి రాజుల మెప్పు పొందేవారు. రాజ్యాలు అంతరించిపోవడంతో ఆ కళ కూడా కనుమరుగు దశకు చేరుకుంది. అయితే పూర్వీకుల నుంచి వచ్చిన ఈ కళను ఎలాగైనా బతికించాలని అదే వీధికి చెందిన షేక్ గౌసియా బేగం భావించింది. చిన్నతనంలోనే తన తండ్రి నుంచి ఈ కళను నేర్చుకుని కేంద్రాన్ని 45 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసింది. అనేకమంది మహిళలకు కళను నేర్పి వారి ఉపాధికి బాటలు వేసింది.

కుటుంబం కోసం..

షాహీనాకు సందానీ అనే వ్యక్తితో వివాహమైంది. వారికి ఏడుగురు సంతానం. కుటుంబ పోషణ సందానీకి భారంగా మారింది. ఆయన నడిపే చిన్న టిఫిన్ దుకాణంలో వచ్చే ఆదాయం సరిపోయేది కాదు. ఈ క్రమంలో తోడికోడలు గౌసియా బేగం నడిపే చెక్క నగిషీ కేంద్రం షాహీనాకు ప్రత్యామ్నాయంగా కనిపించింది. అక్కడే కష్టపడి చెక్క వస్తువులు తయారీ చేసే కళను సొంతం చేసుకుంది. దాని ద్వారా వచ్చే ఆదాయంతో బిడ్డలను చదివించి ప్రయోజకులను చేసింది.

వెలుగులోకి..

ఉదయగిరి చెక్క నగిషీ కేంద్రంలో తయారు చేసిన 150 రకాల హస్తకళా వస్తువులను 2016లో ఢిల్లీలో జరిగిన ఓ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. వీటిని ప్రధాని నరేంద్రమోదీ తిలకించారు. దీంతో ఉదయగిరి చెక్క నగిషీ వస్తువులకు జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది.

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ద్వారా 120 మంది మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చే కార్యక్రమానికి కేంద్రం చేయూతనిస్తోంది. వారిలో అత్యుత్తమ ప్రతిభ చూపిన షేక్ షాహీనాకు తన భర్త సందానీతో కలిసి రిపబ్లిక్ వేడుకలను తిలకించే అవకాశం దక్కింది.


వస్తువుల తయారీలో నిమగ్నమైన షాహీనా

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 138
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	: 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 270
లేయర్ చికెన్	: 145

కండలేరులో 55.248 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో శుక్రవారం నాటికి 55.248 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 200, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

కూరగాయల రైతులను వేధిస్తే ఊరుకోం

- కలెక్టరేట్ వద్ద ధర్నా

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ఏసీ కూరగాయల మార్కెట్‌లో ఏళ్ల తరబడి కూరగాయల వ్యాపారాలు చేసుకుంటున్న రైతులను వేధిస్తే ఊరుకునేది లేదని, ఆందోళనలు ఉధృతం చేస్తామని రైతు సంఘం నాయకులు గండవరపు శేషయ్య, బుజ్జయ్యలు పేర్కొన్నారు. సన్న, చిన్నకారు వ్యాపారులను ఖాళీ చేయించేందుకు అధికారులు పూనుకోవడంతో వారు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నెల్లూరు చుట్టుపక్కల మండలాల కూరగాయల రైతులు ఇక్కడ వ్యాపారాలు చేసుకుంటూ జీవనం పొందుతున్నారన్నారు. అలాంటి వారిని అధికారులు ఖాళీ చేయించేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఉన్నతాధికారులు చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టకుండా వారికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఇందుకూరుపేట, కోవూరు, బుచ్చిరెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు, సంగం, ముత్తుకూరు, సర్వేపల్లి, నెల్లూరు రూరల్ మండలాల రైతులు, సీఐటీయూ నాయకులు సురేష్, రమణయ్య, సుజాతమ్మ, వెంకమ్మ, వినయ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న రైతులు, నాయకులు

మద్యం షాపుల కేటాయింపు

నెల్లూరు రూరల్: ప్రభుత్వ ఆదేశాల మేరకు గీత కార్మికులకు ప్రత్యేకంగా 18 మద్యం షాపులు కేటాయించినట్టు కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని శంకరన్ హాల్లో ఉపకులాలకు షాపులను లాటరీ పద్ధతి ద్వారా కేటాయించారు. ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయుడు మాట్లాడు తూ ఉప కులాలకు కేటాయించిన షాపుల వివరాలతో కూడిన నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం షాపుల కు ఆయా ఉపకులాల్లోని ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి వెంకటలక్ష్మమ్మ, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.


లాటరీ తీస్తున్న అధికారులు

కబడ్డీ జట్ల ఎంపిక

కోవూరు: విశాఖపట్నం జిల్లా చోడవరంలోని అంకుపల్లిలో శనివారం నుంచి 27వ తేదీ వరకు జరిగే 71వ అంతర్ జిల్లాల సీనియర్ కబడ్డీ పోటీలకు జిల్లా జట్లను శుక్రవారం స్థానిక ఎన్జీఓ హోం వద్ద ఎంపిక చేసినట్లు జిల్లా అసోసియేషన్‌కు చెందిన టి.లవకుమార్ తెలిపారు. పురుషుల జట్టులో కెప్టెన్‌గా డి.మునిచంద్ర, ఇంకా ఎన్.శ్రీధర్, ఎస్.యాకోబు, ఆర్.సునీల్, పి.కమలాకర్, డి.శ్రీకాంత్, ఆర్.శ్రావణ్, డి.విష్ణువర్ధన్, జె.విజయబాబు, యు.శేషు, జి.జస్వంత్ ఉన్నారు. టీమ్ మేనేజర్‌గా సీహెచ్ హర్షవర్ధన్, కోచ్‌గా నరేష్ వ్యవహరిస్తారు. మహిళా జట్టు కెప్టెన్‌గా ఎస్.మేరీ, ఇంకా ఐ.తులసి, ఐ.మధులత, జి.ప్రసన్న, వి.ఉమాభారతి, కె.ప్రవళ్లిక, వి.రోహిణి, బి.శుభకేషిత, ఎం.ప్రవళ్లిక, వి.అలేఖ్య, బి.వర్షిత ఉన్నారు. టీమ్ మేనేజర్‌గా ఎన్.వైష్ణవి వ్యవహరిస్తారని వెల్లడించారు. కార్యక్రమంలో కార్యదర్శి జె.విజయానందం, వైస్ ప్రెసిడెంట్ పి.డేవిడ్ జాన్సన్, కె.కొండలరావు, ఎ.సింహాద్రి పాల్గొన్నారు.

ఆర్థిక సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

పొదలకూరు: మండలంలోని మరుపూరు గ్రామానికి చెందిన ఆకురాతి కోటేశ్వరరావు (37) అనే వ్యక్తి శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై ఎస్‌కే హనీఫ్ కథనం మేరకు.. కోటేశ్వరరావు తన భార్యతో కలిసి గ్రామంలో టిఫిన్ దుకాణం నడుపుతున్నాడు. వారికి ఇద్దరు సంతానం. ఆర్థిక సమస్యల నేపథ్యంలో కోటేశ్వరరావు ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెబుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓటే వజ్రాయుధం

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం

నెల్లూరు(అర్బన్): జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఏటా నిర్వహిస్తూ ఓటుపై ప్రజలను చైతన్యం చేస్తోంది ఎన్నికల కమిషన్. గత ఎన్నికల నాటికి జిల్లాలో 20,61,822 మంది ఓటర్లున్నారు. రెండు వారాల క్రితం కమిషన్ విడుదల జాబితాలో ఓటర్లు 19,44,664 మంది ఉన్నారు. 1,17,158 మంది ఓటర్లు తగ్గారు. అత్యధికంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో 2.81 లక్షలు, అత్యల్పంగా కందుకూరులో 2,28,698 మంది ఓటర్లు ఉన్నారు. ఓటులేని ప్రతి ఒక్కరూ నమోదు చేసుకుని వినియోగించుకోవాలని ప్రజాస్వామ్యవాదులు పేర్కొంటున్నారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి	: రూ.30
సన్నవి	: రూ.18
పండ్లు	: రూ.10